క్లుప్తంగా

చిత్రలేఖనం పోటీలకు ఆహ్వానం

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలోని అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ అనుబంధ సంస్థ అయిన బాల మందిరం ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించ నున్నట్లు వ్యవస్థాపకులు అంగర గోపాలకృష్ణా చార్యులు (కృష్ణశ్రీ) తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 11న స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిం చనున్నామన్నారు. హైస్కూల్ స్థాయిలోని 6,7,8,9 తరగతుల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆగస్టు 15న జరిగే జాతీయ పతాకావిష్కరణ సభలో గ్రామ పెద్దలు, మండల విద్యాశాఖ అధికారులతో బహుమతులు అందజేస్తామని ఆయన పేర్కొ న్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల ఏడోతేదీలోగా స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

బీజేపీ మండల నూతన అధ్యక్షుడిగా వెంకటరమణ

అయినవిల్లి: మండల బీజేపీ కార్యకర్తల సమా వేశం ఆ పార్టీ నాయకుడు కుడుపూడి చంద్రశే ఖర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సమావేశంలో మండల నూతన అధ్యక్షుడిగా యనమదల వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి వెంకటే శ్వరరావు, రాష్ట్ర మహిళా మోర్చా నాయకులు ఆకుమర్తి బేబీరాణి తదితరులు వెంకటర మణను అభినందించారు.

రోటరీ క్లబ్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధ్యక్షుడు ఫిలిప్‌రాజు, సభ్యులు

మలికిపురం: స్థానిక రోటరీ క్లబ్ సమావేశం అధ్యక్షుడు గెడ్డం ఫిలిప్ రాజు అధ్యక్షతన మలి కిపురంలో సోమవారం జరిగింది. సమావేశం లో ఆగస్టు నెలలో జరిగే రోటరీ సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చించారు. సేవా కార్య క్రమాల ద్వారానే రోటరీ క్లబ్ సమాజంలో గుర్తింపు పొందిందన్నారు. గత పాలకవర్గం అందించిన సేవలకు గాను అవార్డులు అందు కున్న బత్తుల ఝాన్సీని అభినందించారు. ఈ ఏడాది కూడా రోటరీ క్లబ్‌కు మరిన్ని అవార్డు వచ్చేలా కార్యక్రమాలను రూపొందించాలని ఫిలిప్ రాజు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సభ్యులు గుబ్బల బాబ్జి, కార్యదర్శి బీబీ సంపత్, కోశాధికారి రవిచంద్ర, నల్లి శివకుమార్, బత్తుల ఝాన్సీబాయి తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పేరుకుపోతున్న వ్యర్థాలు



మామిడికుదురులో పైప్‌లైన్ కారణంగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

మామిడికుదురు: గ్రామ పంచాయతీ సమీప పం ట కాలువలో భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకు పోతున్నాయి. దీని వల్ల కాలువ శివారు భూము లకు సాగునీరు సక్రమంగా చేరడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి గ్రావిటీ పైప్‌లైన్ వల్ల ఈ సమస్య ఏర్పడుతోం దని రైతులు చాలా కాలం నుంచి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రావిటీ పైప్‌లైన్‌ను మార్పు చేస్తామని అధికారులు చెబుతున్నా అది కార్య రూపం దాల్చకపోవడంతో సమస్యలు ఏర్పడు తున్నాయి. దీన్ని తక్షణం మార్పు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఆ దిశగా అధికా రులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని కోరుతున్నారు. దీనిపై కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం



అంబాజీపేట హైస్కూల్‌లో వంట షెడ్డు ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

అంబాజీపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 1969 పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు కృతజ్ఞతా పూర్వకంగా వంట షెడ్డును నిర్మించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో నూతనంగా నిర్మించిన వంట షెడ్డును హెచ్ ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన సోమవారం ప్రారంభించారు. కోకో ఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి, హెచ్‌ఎం సాయిరామ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహకరిం చే దాతల సేవలకు వెలకట్టలేనివన్నారు. పాఠశాలలో విద్యార్థులు అవసరమైన షెడ్డు నిర్మించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలి పారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, స్టాఫ్ సెక్రటరి బీఎస్‌ఎన్.మూర్తి, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, ఉమామహేశ్వరరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దోమ కాటు.. పాడికి చేటు

- పాడి పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం
- పశువులకు దోమతెర వినియోగం ఉపయోగకరం



పశువుల కొట్టాంలో మేత తీసుకుంటున్న పశువులు

రావులపాలెం: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇళ్ల మధ్య ప్రాంతాల్లో, ఖాళీగా ఉన్న స్థలాల్లో మురుగు నిలిచి దోమల ఉత్పత్తి తీవ్రతరమవుతుంది. ఈ ప్రాంతాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా వెలిశాయి. దీంతో మనుషులే కాదు, మూగజీవాలు కూడా దోమకాటుతో బాధపడుతున్నాయి. దోమ నుంచి పశువులకు కాపాడుకుంటే పాడి పశువుల పోషణ ఆశాజనకంగా ఉంటుంది. లేని పక్షంలో పశువుల ఆరోగ్యం క్షీణించి, పాల దిగుబడి పడిపోతుందని పశు వైద్యాధికారులు పాడి రైతులను హెచ్చరిస్తు న్నారు. ఈ సమస్యపై పశువుల సంరక్షణకు తీసుకో వాల్సిన జాగ్రత్తలను, చర్యలను వానపల్లి వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ ఎం.రామారావు వివరించారు.

ఈ సీజన్‌లో దోమలతో ఇబ్బంది..

సాధారణంగా దోమల వల్ల పశువులకు ఇబ్బంది. వర్షాలు పడే సీజన్ కావడంతో సమస్య తీవ్రంగా ఉం టుంది. మురుగులో దోమలు ఉత్పత్తి చెంది పశు వులపై ప్రభావం చూపుతాయి. ఈ ప్రభావం పశువు లపై పడకుండా చూడాల్సిన అవసరం ఉంది.

సమస్యలు ఇవీ..

- దోమకాటు వల్ల పాల దిగుబడిపై ప్రభావం పడు తుంది. దిగుబడి తగ్గుతుంది.
- మేత సరిగా తీసుకోవు. ఆకలి మందగిస్తుంది.
- మేత తినకపోవడంతో పశువులు బలహీనంగా తయారవుతాయి.
- పశువులు జ్వరం బారిన పడతాయి. పశువుల శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరిగిపోతుంది.
- సకాలంలో పశు వైద్యులకు చూపించాలి.
- చర్మం దురద వచ్చి పుండు పడుతుంది. దురదలు, ఇతర అలర్జీకి వైద్యుల సలహా మేరకు మందులు వాడాలి.

జాగ్రత్తలు విధిగా పాటించాలి

- పశువులను పాక లేదా షెడ్డులోకి తరలించే ముందు దోమలు లోనికి వెళ్లకుండా చూడాలి.
- పశువులను షెడ్లు/పాకలో కట్టేసిన తరువాత దోమ తెరలు కట్టి తెరకు రంధ్రాలు లేకుండా(ప డకుండా) చూడాలి.
- సాయంత్రం వేప ఆకుతో పొగ పెట్టాలి.
- పశువులను కట్టే పాక/షెడ్డు చుట్టూ గుబురు పొదలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయిం చాలి.
- పశువులను కట్టేసే ప్రదేశాన్ని సిమెంటుతో ఫ్లోరిం గ్ చేసుకోవాలి. తద్వారా పశువుల కాళ్ల వద్ద మురుగు, వ్యర్థాలు నిల్వ ఉండవు.
- షెడ్డును ఎప్పటికప్పుడు శుభ్రం చేసి, మంచి నీటితో కడగాలి. తద్వారా వచ్చిన నీరు కాలువ ల్లోకి మళ్లించాలి.
- పశువుల వ్యర్థాలు, అవి తినగా వదిలేసిన మేత నిల్వ ఉంచకూడదు. ప్రాంగణాన్ని శుభ్రప రుచుకోవాలి.
- పశువులకు నీటిని అందించే కుడితి తొట్టెల్లో నీటిని నిల్వ ఉంచకుండా శుభ్రంగా ఉండేలా చూడాలి.
- పాక/షెడ్డుల్లో మేత వేసేందుకు గాడి ఎక్కువ లోతులో ఉంచుతున్నారు. మూడు అడుగుల కన్నా
- ఎక్కువగా లోతులో గాడి ఉంచితే మేతలో దోమలు చేరి పశువులు మేత తినే సమయంలో వాటిని బాధిస్తాయి.
- కేవలం అరడుగు నుంచి అడుగు లోతు, రెండు అడుగుల వెడల్పు మాత్రమే మేత గాడి ఉండేలా చూడాలి.

కొత్తపేట నియోజకవర్గంలో పశువుల వివరాలు..

మండలం	ఆవులు	గేదెలు
రావులపాలెం	1283	4476
కొత్తపేట	1464	3660
ఆత్రేయపురం	1522	5587
ఆలమూరు	1612	6023

అప్రమత్తత అవసరం



దోమల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలి. జ్వరం, అలర్జీ, దోమకాటు నుంచి పశువులను సంరక్షించుకోవాలి. లేని పక్షంలో పాల దిగుబడిపై ప్రభావం పడి పాడి రైతులు ఒక్కోసారి పెద్ద మొత్తంలో నష్టపోవాల్సి ఉంటుంది.

– ఎం.రామారావు, వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్, వానపల్లి

మోసపూరిత హామీల గారడీ

- కోఆర్డినేటర్ గొల్లపల్లి
- మేనిఫెస్టో గుర్తు చేస్తూ ఇంటింటికీ ప్రచారం



పల్లిపాలెంలో నిర్వహించిన ఇంటింటికీ వంచన కార్యక్రమంలో గొల్లపల్లి, నాగేంద్ర

సఖినేటిపల్లి: చంద్రబాబు మోసపూరిత సూపర్‌సిక్స్ హామీలకు కేరాఫ్ అడ్రస్‌గా గారడీ ఎన్నికల మేనిఫెస్టో నిలిచిందని రాజోలు వైఎస్సార్ సీపీ ఇన్ చార్జ్ గొల్లపల్లి సూర్యారావు విమర్శించారు. సోమవారం పల్లిపాలెం, అంతర్వేది దేవస్థానం, అం తర్వేదికర గ్రామాల్లో పార్టీ నియోజకవర్గ పరిశీల కుడు మట్టపర్తి నాగేంద్రతో కలసి గొల్లపల్లి బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీలో భాగంగా ఇంటింటికీ వంచన పేరుతో చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ నియోజకవర్గంలో ఐదు వారాల బృహత్తర కార్యక్రమం కింద తొలిరోజు నిర్వహించారు. మం డల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ అధ్యతన ఈ మేరకు జరిగిన గ్రామ స్థాయి సమావేశాల్లో గొల్లపల్లి, నాగేంద్ర ముఖ్య అతిథులుగా మాట్లా డారు. గొల్లపల్లి మాట్లాడుతూ, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం, దగా చేయడం చంద్రబాబు నైజమని ధ్వజమెత్తారు. నాగేంద్ర మాట్లాడుతూ, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జగన్‌మోహన్ రెడ్డి పాలనకు, చంద్ర బాబు పాలనకు వ్యత్యాసాన్ని గుర్తించాలని ప్రజలకు సూచించారు. అనంతరం ఆయా గ్రామాలలో గొల్లప ల్లి, నాగేంద్ర ఇంటింటికీ వంచన కరపత్రాలను అంద జేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గునెశెట్టి వాసు, నల్లి ఆశీ ర్వాదం, బీర బాబులు, పాటి జవహర్‌లాల్, దాసరి సత్యనారాయణ, జిల్లా శ్రీనివాస్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన రాజా, జిల్లా ఉపాధ్యక్షుడు కూనపురెడ్డి రాంబాబు, విద్యార్థి విభాగం ప్రతినిధి తాడి సహదేవ్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు దొంగ ఏసు తదితరులు పాల్గొన్నారు. తొలుత అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి గొల్లపల్లి, నాగేంద్ర పూజలు చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

బలవంతపు మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిద్దాం

మలికిపురం: బలవంతంగా విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించవద్దని అలా చేస్తే వ్యతిరేకిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మలికి పురంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆగస్టు 5న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ధర్నాలను జయ ప్రదం చేయాలన్నారు. విద్యుత్ భారాలను ప్రజలపై మోపొద్దని, ట్రూ అప్ చార్జీలను రద్దుచేయాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించవద్దని, వినియోగదా రులు కూడా మీటర్ల బిగింపును అడ్డుకోవాలని అన్నారు. స్మార్ట్ మీటర్ల వలన మరింత విద్యుత్ భారం మోయాలని, ముందుగానే విద్యుత్ బిల్లులు రీచార్జ్ చేసుకోవాలని, రాత్రి పూట వినియోగించే చార్జీలు మరింత ప్రీమియంగా ఉంటాయని అన్నారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు బిగించకుండా పగు లగొట్టాలని పిలుపునిచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తగద న్నారు. రేపు సబ్‌స్టేషన్ల వద్ద జరిగే ధర్నాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని నిరసన తెలియచేయాలని రాజేం ద్రప్రసాద్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఐ నాయ కులు గెడ్డం, ప్రభాకరరావు, చెల్లుబోయిన తాతారావు, దేవ సురేషబాబు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనే ధ్యేయంగా పని చేయాలి



చొప్పెల్లలో ఇటుక బట్టీ కార్మికుల ఆరోగ్య పరిస్థి తులను తెలుసుకుంటున్న డీఎంఓ తదితరులు

ఆలమూరు: జిల్లా వ్యాప్తంగా మలేరియా నిర్మూలనే ధ్యేయంగా పనిచేయాలని జిల్లా మలేరియా ప్రత్యేక అధికారి ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. మండలం లోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలోని ఇటుక బట్టీలను సోమవారం వైద్యాధికారులు ఎస్. లక్ష్మీస్నేహలత, డి.సాయికిషోర్‌తో కలసి సందర్శిం చారు. కార్మికుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలు సుకున్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే సత్వ రమే సమీప ఆస్పత్రికి తరలించి మెరుగైన చికి త్సను అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కొత్తపేట డివిజన్ మలేరియా యూనిట్ అధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు, సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈ ఓలు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వై జర్లు పి.శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, ఆర్.బా లామణి తదితరులు పాల్గొన్నారు.

80 శాతం రోడ్లను అభివృద్ధి చేశాం



నగరం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: కూటమి ఏడాది పాలనలో మామి డికుదురు మండలంలో 80 శాతం రోడ్లను అభివృ ద్ధి చేశామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారా యణ తెలిపారు. నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. అప్పనపల్లి కాజ్‌వే పునర్నిర్మాణానికి రూ.22 కోట్లు మంజూరయ్యాయ న్నారు. రెండు మూడు నెలల్లో పనులు ప్రారంభి స్తామని తెలిపారు. బి.దొడ్డవరం–పెదపట్నంలంక ఏటిగట్టు రోడ్డుకు రూ.1.25 కోట్లు మం జూరయ్యాయని ఫైనాన్స్ క్లియరెన్సు రావాల్సి ఉం దన్నారు. పాశర్లపూడిలంలో సీసీ రోడ్డుకు రూ.1.20 కోట్లు, లూటుకుర్రు–బాడిలంక రోడ్డుకు రూ.1.25 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. సమావేశం లో కూటమి నేతలు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం నిర్మిస్తారా?



అంబాజీపేటలో అసంపూర్తిగా ఉన్న తహసీల్దార్ భవనం

అంబాజీపేట: అసంపూర్తిగా నిలిచియిన అంబా జీపేట తహసీల్దార్ కార్యాలయ నిర్మాణాన్ని పూర్తి స్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్మిస్తారో లేక గాలికొదిలేస్తారో వేచి చూడాలని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. 2018 టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.90 లక్షలతో తహసీల్దార్ భవన నిర్మాణానికి స్థానిక పశువుల మార్కెట్ వద్ద భూమి పూజ చేశారు. భవన నిర్మాణ పనులు సుమారు 50 శాతం పూర్తయినప్పటికీ మిగి లిన పనులు పూర్తి చేయకుండా అప్పటి ప్రజాప్రతిని ధులు గాలికొదిలేశారు. ఇచ్చిన నిధులు అరకొరగా మంజూరవడంతో కాంట్రాక్టర్ పని చేయకుండా చేతులెత్తేశారని అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పుకొచ్చారు. లక్షలు వెచ్చించి నిర్మించిన తహ సీల్దార్ కార్యాలయం అసంపూర్తిగా దర్శనమిస్తున్న అధికారులెవరికీ చీమకుట్టినట్లు కూడా లేదని పలు వురు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం పాత తహసీల్దార్ కార్యాలయం ఇరుకు గదుల్లోనే అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న తహసీ ల్దార్ కార్యాలయాన్ని పూర్తి స్థాయిలో నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.12 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. గ్రామానికి చెందిన తీపర్తి సుబ్బారావు (60) పెరాలసిస్‌తో ఓ కాలు, చేయి పనిచేయడం లేదు. గతంలో వాచ్‌మన్‌గా పని చేసేవారు. వైద్యం చేయించుకునే స్తోమత లేక కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. కొత్త కాలనీలో సుబ్బారావు ఇంటికి వెళ్లి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.12 వేల చెక్కు సాయంగా అందజేశారు.

వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ విభాగం కమిటీలు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలోని వివిధ మండల వైఎస్సార్ సీపీ ఎస్సీ విభా గాల అధ్యక్షులను పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ప్రకటించింది. సఖినేటిపల్లి మం డల వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షు లుగా కొల్లాబత్తుల చిట్టిబాబు, మలికిపురం మండలానికి బల్ల కిరణ్‌కుమార్, రాజోలు మండలానికి బుంగ శ్రీనివాస్, మామిడికు దురు మండలానికి భూపతి మహేంద్రబాబు లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది.

డయాలసిస్ రోగికి వాకర్ అందజేత



సునీతకు వాకర్‌ను అందజేస్తున్న సహదేవ్

మామిడికుదురు: గ్రామానికి చెందిన గెడ్డం సునీత గత కొంతకాలంగా కిడ్నీల సమస్యతో బాధపడుతున్నారు. ఆమె ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయం. వారానికి మూడు పర్యాయాలు డయాలసిస్ చేయించుకోవా ల్సిన పరిస్థితి. ఒక లెటర్ ద్వారా తన ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ ఆమె సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. వాకర్ సహాయం లేనిదే నడవలేని పరిస్థితి ఆమెది. పాత వాకర్ పాడైపోయింది. ఆమె సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుకు స్పందించిన సఖినేటిపల్లి మం డలం రామేశ్వరానికి చెందిన మత్తి జగన్ ఆమె కోసం వాకర్ కొన్నారు. దాన్ని తాడి సహదేవ్ చేతుల మీదుగా సోమవారం సునీతకు అంద జేశారు. కార్యక్రమంలో నల్లి చిన్న, కంచి శ్రీరామ్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అవసరం



ఇసుకపూడిలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

అంబాజీపేట: పాఠశాల అభివృద్ధికి దాతల సహ కారం ఎంతో అవసరమని హెచ్‌ఎం ఎ.లక్ష్మీ వరప్ర సాద్ అన్నారు. ఇసుకపూడి జెడ్పీ ఉన్నత పాఠశా లలో గత కొన్నేళ్లుగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్ ఆకెళ్ల మంగళగిరి శాస్త్రి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సుబ్బారావు, ఆయన కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో రూ.50 వేలు విలువైన మినీ ఆర్వో ప్లాంటును పాఠశాలకు సోమవారం వితరణ చేశారు. హెచ్‌ఎం వరప్రసాద్ మాట్లాడుతూ పాఠ శాల సిబ్బంది, విద్యార్థులు తాగేందుకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో లేకపోవడంతో ఆర్వో ప్లాంట్ల నుంచి టిన్నుల ద్వారా తాగునీరు రప్పించు కుంటున్నారన్నారు. విద్యార్థులు బాటిల్స్‌తో ఇంటి నుంచి వాటర్ తెచ్చుకున్నా సరిపోకపోవడంతో బయట నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నామని తెలిపారు. పాఠశాలలో ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను గుర్తించిన గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునుకుట్ల నాగేశ్వరమౌళి పాఠ శాలలో తాగునీటి సమస్యను దాతల దృష్టికి తీసుకు వెళ్లడంతో సమస్య పరిష్కారమై ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారన్నారు. ఎస్‌ఎంసీ చైర్మన్ పళ్ల స్వామి నాయుడు దాతల సమక్షంలో ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. పాఠశాలకు మినీ ఆర్వో ప్లాం ట్‌ను బహూకరించిన దాతలకు పాఠశాల సిబ్బంది, యాజమాన్యం కమిటీ అభినందనలు తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడులు



ఎల్.గన్నవరంలో ఆయిల్‌పామ్ రైతుకు సత్కారం

పి.గన్నవరం: ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబ డులు సాధించవచ్చని ఉద్యాన శాఖ అధికారి శైలజ అన్నారు. మండలంలోని ఎల్.గన్నవరంలో సోమవారం ఉద్యాన శాఖ, సర్వేసాయి ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేటు లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కం పెనీ జనరల్ మేనేజర్ కేజే ప్రభాకర్‌రావు అధ్య క్షతన జరిగిన సమావేశంలో శైలజ మాట్లాడుతూ ఈపంట సాగుపై రైతులకు లభించే రాయితీలను వివరించారు. ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుతో ఎకరానికి ఏడాదికి ఖర్చులు పోను రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకూ ఆదాయం పొందవచ్చని వివరించారు. ఓసారి మొక్కలు వేస్తే 35 ఏళ్లపాటు దిగుబడి వస్తుందన్నారు. ఎక్కువ లాభాలు పొందిన రైతు మట్టా వెంకటరావును సత్కరించారు. గ్రామంలో చిట్టాల జోగేశ్వరరావు ప్రాంగణం వద్ద ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఇన్‌చార్జి సర్పంచ్ గనిశెట్టి గంగాభవాని, ఏజీఎం పి.వీరభద్రం, మేనేజర్ బి.వెంకట కృష్ణంరాజు, సెంటర్ ఇన్‌చా ర్జిలు హరికృష్ణ, రాజు, వెంకటేశ్వరరావు, రైతు నాయకులు ఆరుమిల్లి సత్య సాయిబాబు, సుబ్బారావు, మాజీ సర్పంచ్ యన్నాబత్తుల వెం కటేశ్వరరావు, ఎంపీటీసీ అవనిగడ్డ సత్యనారా యణ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాలుగు గ్రామాల్లో రచ్చబండ

అంబాజీపేట: బాబు ష్యూరిటీ.. మోసం గ్యారం టీలో భాగంగా రచ్చబండ కార్యక్రమాన్ని గంగల కుర్రు అగ్రహారం, గంగలకుర్రు, చిరతపూడి, ఇసుక పూడి గ్రామాల్లో మంగళవారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కో ఆర్డినేటర్ గన్నవ రపు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొనున్నా రన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీ టీసీలు, సర్పంచ్‌లు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మహిళలకు స్వయం ఉపాధిపై శిక్షణ

పి.గన్నవరం: ఊడిమూడి శివారు ఆదిమూలంవారి పాలెంలో మహిళలకు స్వయం ఉపాధిపై శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. అగర వత్తులు, ఇతర పూజా సామగ్రి తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్టు ఎస్ఎస్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీలు సంధ్య, మోహనకృష్ణ తెలిపారు. శిక్షణ అనంతరం మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు వేతనం ఇవ్వనున్నట్టు వారు వివరించారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు ఆదిమూలం వెంకన్నబాబు నివాసం వద్ద ఏర్పాటు చేసిన ఈకార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ యాళ్ల విజయదుర్గ, గ్రామానికి చెందిన మహిళలు పాల్గొన్నారు.

ఆబోతుకు అంత్యక్రియలు

కొత్తపేట: రోడ్డుపై కారు ఢీకొని మృతి చెందిన ఆబో తుకు గ్రామస్తులు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వ హించారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కొత్తపేట మండలం మోడేకుర్రు పరిధిలో తిరిగే ఆబో తును గొలకోటివారిపాలెం వద్ద సోమవారం తెల్లవా రుజామున ఒక కారు ఢీకొట్టింది. ఆబోతు అక్కడిక క్కడే మరణించింది. ఆబోతు మరణించిన విషయం తెలిసిన సర్పంచ్ కె.రామలక్ష్మి దంపతులు వెళ్లి, పండి తుల సూచనల మేరకు ఆబోతు మృతదేహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఖననం చేశారు. కార్యక్ర మంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.25 వేల విరాళం



దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలుచేస్తున్న నిత్యా న్నదాన ట్రస్టుకు అదే గ్రామానికి చెందిన తటవ ర్తి లక్ష్మీనారాయణ వారి కుటుంబ సభ్యులు సోమవారం రూ.25 వేలు విరాళంగా అందిం చారు. విరాళం అందించిన దాత కుటుంబ సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం అందిం చారు. ఆలయ పర్యవేక్షకులు సత్యమూర్తి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజే శారు. ఆలయ ఈఓ వి.సత్యనారాయణ దాత కుటుంబ సభ్యులను అభినందించారు.

ఎంపీడీఓకు తప్పిన పెను ప్రమాదం

ఆలమూరు: జొన్నాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపేట ఎంపీడీఓ నరేష్‌కుమా ర్‌కు పెను ప్రమాదం తప్పింది. ఎంపీడీఓ ఉద్యోగ బాధ్యతల నిమిత్తం రాజమహేంద్ర వరం నుంచి కొత్తపేటకు కారులో బయలుదే రారు. స్థానిక జొన్నాడ సెంటర్‌కు వచ్చేసరికి కారు అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు పాక్షిక గాయాల య్యాయి. సమాచారం అందుకున్న ఆల మూరు ఎంపీడీఓ ఎ.రాజు, ఎస్సై జి.నరేష్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎంపీడీఓ నరేష్‌కు మార్‌ను రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్ప త్రికి తరలించారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాం బిక అమ్మవారి ఆలయం ఆవరణలో భక్తుల సౌకర్యార్థం నిర్మిం చనున్న మరుగుదొడ్లకు సోమవారం భూమి పూజ జరిగింది. స్థానిక ఆలయ సమీపంలో స్వచ్ఛభారత్ పథకంలో భాగంగా సుమారు రూ.24 లక్షలతో ఎనిమిది మరుగుదొడ్ల నిర్మాణం జరగనుంది. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్ర మంలో ఆలయ ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి పాల్గొని భూమి పూజ చేశారు.